క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



జనగామ: స్థానిక సీఐగా పి.దామోదర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పనిచేస్తున్న సీఐ రఘుపతిరెడ్డిని హెడ్‌క్వార్టర్‌కు బదిలీ చేయగా, సీసీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న దామోదర్‌రెడ్డికి జనగామకు పోస్టింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడే విషయంలో అనునిత్యం అప్రమత్తంగా ఉంటామన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



బచ్చన్నపేట: శ్రావణ మాస తొలి శుక్రవారంను పురస్కరించుకొని ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. బచ్చన్నపేట శివాలయంలో అమ్మవారికి మహిళలు లక్ష పుష్పార్చన చేపట్టారు.

మంత్రికి ఫొటో అందజేత



బచ్చన్నపేట: రాష్ట్ర పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్కకు మండలంలోని బండనాగారం గ్రామానికి చెందిన విద్యార్థిని ఇజ్జగిరి రేఖ గీసిన ఫొటోను అందజేసింది. శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి రేఖ స్వయంగా చేతితో గీసి తయారు చేసిన మహిళ చిత్రాన్ని సీతక్కకు అందించగా రేఖను సీతక్క అభినందించారు. ఇజ్జగిరి రాములు ఉన్నారు.

ఆయుర్వేదానికి చరకుడు వెన్నెముక



జనగామ: ఆయుర్వేదానికి చరకుడు వెన్నెముక లాంటి వారిని జనగామ వేద ఆయుర్వేద పంచకర్మ వెల్‌నెస్ హాస్పిటల్ డాక్టర్ అంజిరెడ్డి అన్నారు. చరక జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా చరకుడిని జనరల్ మెడిసిన్ పితామహుడిగా కూడా పిలుస్తారని, పురాతన భారతదేశంలో అనేక రోగాలను నయయం చేసేందుకు ఆయుర్వేదంలో చరకుడి సహకారంతో ఔషదాలు తయారు చేసినట్లు పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం ఆహారపు అలవాట్లు, నిత్యానంద జీవన ప్రయాణంలో ఎలా ఉండాలనే విషయాన్ని చరక సంహిత గ్రంథంలో తెలిపారని వివరించారు.

మెరుగైన సేవలు


రఘునాథపల్లి: వినియోగదారులకు మెరుగైన సేవలందించడం లక్ష్యంగా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సీబీఐ) పని చేస్తుందని మండలంలోని కంచన పల్లి బ్యాంకు సీనియర్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బ్యాంకు వ్యవస్థాపకుడు సర్ సోరబ్‌జి పోచ్‌కన్ వాలా జయంతి శుక్రవారం కంచనపల్లిలోని బ్యాంకులో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కుర్చపల్లి, గోవర్ధనగిరిలో బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



జఫర్‌గఢ్: విధి నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ టి.వేణుమాధవ్ సూచించారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది విధుల నిర్వహణలో అప్రమత్తండా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. డీఈ ఎం.హుస్సేన్ నాయక్, ఏడీఈ వంశీకృష్ణ, ఏఈ కే విశ్వసాహితి, సబ్ ఇంజనీర్ రాంబాబు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి



జనగామ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం గానుగుపహడ్ గ్రామంలో బీజేపీ తలపెట్టిన రచ్చబండ కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు లద్దునూరి మహేష్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, శ్రీనివాస్, శివరాజ్, రమేశ్, ఉపేందర్, మహిపాల్, బాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు

జనగామ: బాలాజీనగర్‌లో..



నర్మెట: పూజ చేస్తున్న మహిళలు



జనగామ: విజయదుర్గ ఆలయంలో..



భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నాగుల పంచమి వేడుకలను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని పోచమ్మ, ఉప్పలమ్మ, సంతోషిమాత, గీతాశ్రమం, బతుకమ్మకుంట దుర్గామాత, రామలింగేశ్వరస్వామి, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు, భక్తులు తరలివచ్చి పుట్టలో పాలు పోసి నైవేద్యం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. పిల్లా పాపలను చల్లగా చూడాలని మొక్కులు చెల్లించారు.



చిల్పూరు: బండలగుట్టలో..



స్టేషన్‌ఘన్‌పూర్ శివాలయంలో..

యూత్ కాంగ్రెస్‌కు అత్యధిక సభ్యత్వాలు



జనగామ: జెండా ఆవిష్కరణలో శివరాజ్‌యాదవ్



ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న ఆసిఫ్

జనగామ: యూత్ కాంగ్రెస్‌కు ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు కలిగి ఉందని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు డీసీసీ కార్యాలయం ఆవరణలో శివరాజ్ యూత్ కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఎంసీహెచ్‌లో పేషెంట్లు, గర్భిణులు, బాలింతలకు బ్రెడ్లు, పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో అంతకిత భావంతో పని చేస్తున్న ప్రతి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సర్వల నర్సింగరావు, నాయకులు చెంచారపు బుచ్చిరెడ్డి, లింగాల నర్సిరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి క్రాంతి, లక్ష్మీనారాయణ, వంగల మల్లారెడ్డి, బడికె కృష్ణ స్వామి, మాసపేట రవీందర్ రెడ్డి బాల రాజుగౌడ్, సిద్దులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పండ్ల పంపిణీ

యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న మహమ్మద్ ఆసిఫ్ (అషు)ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పేషెంట్లకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. జిల్లా నాయకులు గాజే అనిల్, గుగ్గిళ్ల శ్రీధర్, వెంకటేష్ యాదవ్, కూరాకుల నాగరాజు, కాల్వ నాగరాజు, రామగాళ్ల అభిన య్, మదం శెట్టి ఉదయ్, కొలిపాక మహేష్, కొడిదల అజయ్, దేవరాయ పవన్, ప్రణయ్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

తరిగొప్పుల: యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అర్జుల అరుణ్‌రెడ్డి ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో ఎన్ఎస్‌యూఐ జెండాను ఆవిష్కరించి సంబురాలు జరుపుకున్నారు. యాదగిరి, అరుణ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కనుకయ్య పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ మండల నాయకులు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగికి బదిలీ సహజం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

నర్మెట: ప్రభుత్వ ఉద్యోగులకు వృత్తిరీత్యా బదిలీలు, పదవీ విరమణలు సహజమని మాజీ జెడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బొమ్మకూర్ ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయలు గంగం కవిత, పోతరాజు స్వప్నరాణీలను ప్రజాప్రతినిధులు, సహోపాధ్యాయులు శుక్రవారం సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడిన అనంతరం మాజీ ప్రజాప్రతినిధులను ఉపాధ్యాయులు సన్మానించారు. సత్యసాయి సేవాట్రస్టు వారు విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ శంకర్ నాయక్, హెచ్ఎం మెరుగు రామరాజు, ఉపాధ్యాయులు అంకం రాజ్‌కిరణ్, కృష్ణవేణి, కార్యదర్శి సుజాత పాల్గొన్నారు.

ఆత్మీయ వీడ్కోలు సమావేశం

తరిగొప్పుల: మండలంలోని బోజ్యాతండా శివారు పంచరాయితండా ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు రామన్న, కోమలాదేవిలకు గ్రామస్తుల ఘనంగా వీడ్కోలు పలికారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించి శాలువాతో సన్మానించారు. అదేవిధంగా బదిలీలో భాగంగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు సుమిత్ర, రాజేందర్‌లకు శాలువాలతో స్వాగతం పలికారు. పాఠశాల ఏఏపీసీ చైర్మన్ రుక్కమ్మ, వైస్‌చైర్మన్ కిషన్ పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్: తాను చిన్నప్పుడు చదువుకున్న పాఠశాలలో ఉపాధ్యాయుడిగా, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడిగా 12 ఏళ్లు సేవందించడం సురేష్ అదృష్టమని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం భాస్కర్ అన్నారు. జఫర్‌గఢ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వర్తించి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు సురేష్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు.

ఎలుకల మందు తాగి యువకుడి ఆత్మహత్య

తల్లి మందలించిందని..



కిరణ్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్‌కు చెందిన మోతె కిరణ్(23) తల్లి మందలించిందనే కోపంతో మద్యం మత్తులో ఎలుకల మందును ఈనెల 7వ తేదీన తాగగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి సోదరుడు మోతె సామ్యేల్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందించిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బేడ బుడిగ జంగం కులానికి చెందిన కిరణ్ వారి కులవృత్తి చేస్తున్నాడు. అతడికి ఏడాది క్రితం వివాహం జరిగింది. కాగా, ఇటీవల మద్యానికి అలవాటు పడి జల్సాలు చేస్తూ తిరుగుతున్నాడు. ఈ క్రమంలో ఈనెల 7న మధ్యాహ్నం మద్యం సేవించి వచ్చిన కిరణ్‌ను తల్లి ఎప్పుడు తాగుడేనా, ఇలా అయితే ఎలా అని మందలించింది. ఇంట్లో ఎవరులేని సయంలో మద్యం మత్తులో ఉన్న కిరణ్ ఎలుకల మందును తాగాడు. అనంతరం వాంతులు చేసుకుంటుండగా గమనించిన భార్య జరిగిన విషయం తెలుసుకుని అత్తకు సమాచారం అందించింది. వెంటనే స్థానికుల సాయంతో అతడిని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడ నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు.

పిచ్చికుక్క స్వైర విహారం



పిచ్చికుక్క దాడిలో గాయపడిన మల్లిక

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లలో శుక్రవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి ముగ్గురిపై దాడి చేసింది. ఈ సంఘటనలో రెండున్నరేళ్ల చిన్నారి నూకల మల్లిక, నాలుగేళ్ల గొరిగె సాక్షిత్, నర్సింగ లీలాలకు గాయాలయ్యాయి. సంఘటనలకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మల్లిక ఇంటి ముందు ఆడుకుంటుండగా ఒక్కసారిగా పిచ్చికుక్క దాడి చేసి చేతిపై కరిచింది. కుటుంబ సభ్యులు గమనించి వెంబడించగా పారిపోయి మరో నాలుగేళ్ల సాక్షిత్‌ను, అదే విధంగా నర్సింగ లీలాలను గాయపరిచింది. గ్రామస్తులు వెంబడించి పిచ్చి కుక్కను దొరకబట్టి చంపివేశారు.

కలప లారీ పట్టివేత



బచ్చన్నపేట: మండల కేంద్రంలో కలప అక్రమంగా రవాణా చేస్తున్న లారీని పట్టుకున్నట్లు ఎస్సై కంకల సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతూ ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మండలంలోని పోచన్నపేట గ్రామ సమీపంలో కలపలోడ్‌తో వెళ్తున్న లారీని ఆపి డ్రైవర్‌ను విచారించి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు. అనంతరం ఫారెస్ట్ అధికారులకు లారీని అప్పగించగా వారు జనగామకు తీసుకెళ్లారని చెప్పారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి

చిల్పూరు: పోస్టాఫీసుల్లో ప్రజలకు ఎన్నో రకాలైన సేవలు అందుబాటులోకి వచ్చాయని, ప్రతీఒక్కరు వాటిని సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ సబ్ డివిజన్ ఏఎస్పీ మూల రమాదేవి అన్నారు. మండలంలోని మల్కాపూర్ సబ్‌డివిజన్ పరిధిలోని వెంకటాద్రిపేట తపాలాశాఖలో శుక్రవారం వివిధ రకాల స్కీంలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో ప్రతీ ఒక్కరికి ఇన్సూరెన్స్ అవసరమని, అందుకు పోస్టాఫీసుల్లో తక్కువ ఖర్చుతో ఎన్నో రకాల స్కీంలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంఓ శ్రీనివాసులు, మల్కాపూర్ ఎస్‌పీఎం దేవేందర్, గ్రామ బీపీఎం గణేశ్, ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం ఎల్లయ్య, పంచాయతీ కార్యదర్శి పిట్టల బాబు, వివిధ గ్రామాల బీపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి టౌన్: తపాలాశాఖ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తపాలా శాఖ సబ్ డివిజన్ పర్యవేక్షణ అధికారి విద్యాసాగర్ అన్నారు. మండలంలోని మల్లంపల్లి గ్రామంలో తపాలాశాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బాలకృష్ణ, తిరుపతి, ప్రవీణ్, రాజేష్, స్వాతి పాల్గొన్నారు.

వనాలుంటేనే వర్షాలు కురుస్తాయి

● జెడ్పీ సీఈఓ సరిత



బచ్చన్నపేట: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ సీఈఓ, డీపీఓ తదితరులు

బచ్చన్నపేట/కొడకండ్ల/దేవరుప్పుల/స్టేషన్‌ఘన్‌పూర్: వనాలు ఉంటేనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి.. అప్పుడే అన్నదాతలు సంతోషంగా సేద్యం చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది.. అందుకే అందరూ విధిగా మొక్కలు నాటాలని జెడ్పీ సీఈఓ సరిత అన్నారు. శుక్రవారం 'స్వచ్ఛదనం-పచ్చదనం'ముగింపు సందర్భంగా ఆలింపూర్‌లో జరిగిన వనమహోత్సవంలో మొక్కలు నాటిన అనంతరం మాట్లాడారు. ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని చెప్పారు. గ్రామాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా.. తాగు నీటి పైపులు లీకేజీలు లేకుండా చూడాలని అన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్, మాజీ ఎంపీటీసీ మసూద్, ఎంపీడీఓ రఘురామకృష్ణ, ఏపీఓ కృష్ణ, ఏపీఎం నాగేశ్వర్‌రావు, టీఏ కర్ణాకర్, స్వామి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు. అలాగే కొడకండ్ల, దేవరుప్పుల, స్టేషన్‌ఘన్‌పూర్ మండలాల్లోని గ్రామాలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం చివరి రోజు కార్యక్రమాల్లో అధికారులు పాల్గొని మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో విద్యుత్‌శాఖ జనగామ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి, డీఆర్‌డీఓ వసంత , బీసీ సంక్షేమ శాఖాధికారి రవీందర్, ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి, ఫారెస్ట్ డిప్యూటీ రెంజ్ ఆఫీసర్ నర్సింహులు, బీట్ ఆఫీసర్ అఖిలేష్‌గౌడ్, ఏడీఈ అనిల్‌కుమార్, ఏఈ సుధాకర్, సోనియా, ఉదయ్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మధుసూదన్, కార్యదర్శి శ్రీకాంత్, ఏపీఓ ప్రేమయ్య, ఉపాధ్యాయులు, ఆశలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం

● ఎన్పీడీసీఎల్ డీఈ హుస్సేన్‌నాయక్



నిడిగొండ పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న విద్యుత్ అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్/జఫర్‌గఢ్: రైతులకు సంబంధించి వ్యవసాయ విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎన్పీడీసీఎల్ డీఈ ఎం.హుస్సేన్‌నాయక్ అన్నారు. విద్యుత్‌శాఖ నిర్వహిస్తున్న 'పొలంబాట'లో భాగంగా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నమిలిగొండ, జఫర్‌గఢ్ మండలం తిమ్మంపేట గ్రామాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రైతులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించడమే 'పొలంబాట' లక్ష్యమని, వ్యవసాయ క్షేత్రాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నచోట గద్దెల ఎత్తు పెంచడం, లూజ్‌గా కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయడం, వంగిన విద్యుత్ స్తంభాలను సరిచేయడం తదితర పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఏడీఈ వంశీకృష్ణ, లైన్‌మన్ కాలురామ్‌నాయక్, జేఎల్ఎం వెంకటేష్, రాము, సురేష్, రాజు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్‌లైన్ల పునరుద్ధరణకు చర్యలు

దేవరుప్పుల: కాలంచెల్లిన విద్యుత్‌లైన్ల పునరుద్ధరణకు సత్వర చర్యలు చేపడుతామని ఎన్పీడీసీఎల్ డివిజనల్ ఇంజనీర్ లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గొల్లపల్లి, మున్‌పహాడ్‌లో విద్యుత్‌శాఖ రైతు పొలంబాటలో భాగంగా పలు ఏరియాల్లో వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి కరెంటు సరఫరా లైన్ వసతుల తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతలకు అండగా నిలిచేందుకు శాఖాపరంగా చేపడుతున్న రైతు పొలంబాటను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏడీఏ అనిల్‌కుమార్, ఏఈ పి.సుధాకర్, సబ్‌ఇంజనీర్ సోనియా, బి. ఉదయ్, లైన్‌మెన్లు రాజేశ్వర్, నర్సయ్య పాల్గొన్నారు.

కేపాసిటర్లు అమర్చుకోవాలి

కొడకండ్ల: రైతులు మోటర్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని విద్యుత్ ఏఈ రాములు సూచించారు. శుక్రవారం రైతు పొలంబాట కార్యక్రమంలో భాగంగా లక్ష్మక్కపల్లి గ్రామంలో రైతులకు కెపాసిటర్లు అమర్చుకోవడం వలన కలిగే ప్రయోజనాలు, విద్యుత్ ప్రమాదాల నివారణ, భద్రతలపై ఏఈ అవగాహన కల్పించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. సబ్ ఇంజనీర్ రాకేష్, లైన్‌మెన్ కోట రాజలింగం, జేఎల్ఎం సంతోష్, కట్టర్ భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలనే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: అవినీతి రహిత పాలన అందిస్తూ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో సమగ్రాభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద యూత్‌కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించిన అనంతరం పార్టీ మండల సమన్వయ కమిటీ, యూత్ కాంగ్రెస్ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశామని, ఉత్తర్వులు అక్టోబర్ 15లోగా వస్తాయన్నారు. ఇదిలా ఉండగా.. యూత్ కాంగ్రెస్ ఎన్నికల నేపథ్యంలో మండల సమన్వయ కమిటీ ప్రతిపాదించిన వ్యక్తికే నా మద్దతు ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు బస్వగాని అనీల్ గౌడ్, నాయకులు సీహెచ్.నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, అన్నం బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్, మత్తుకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

జఫర్‌గఢ్: ర్యాగింగ్‌తోపాటు డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తోటి విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురిచేయడమే ర్యాగింగ్ అని.. ఇటువంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని చెప్పారు. అనంతరం పాఠశాల ఆవరణలో డీసీపీ మొక్కలు నాటారు. కార్యక్రమంలో వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, ఎస్సై రామ్‌చరణ్, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'విరాళాల లెక్కలు తేల్చాలి'

చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లి గ్రామంలో నిర్మించిన దుర్గామాత గుడి నిర్మాణం కోసం భక్తుల ద్వారా వచ్చిన విరాళాల లెక్కలు చెప్పేందుకు ఆలయ చైర్మన్, మాజీ సర్పంచ్ కేశిరెడ్డి ప్రత్యూషా భర్త మనోజ్‌రెడ్డి రావాలంటూ శుక్రవారం గ్రామ ప్రజలు గుడికి చేరుకున్నారు. చాలా సేపు ఎదురు చూసినా అతను రాకపోవడంతో గుడి కోసం సేకరించిన విరాళాల లెక్కలను వారు వివరించారు. గుడి నిర్మాణం మొదలైన నాటి నుంచి దాతలు ముందుకు వచ్చి నిర్మాణంలో పాలు పంచుకున్నారని తెలిపారు. అయితే విరాళాల ద్వారా వచ్చిన నిధులు ఏమైనట్లని ప్రశ్నించారు. గ్రామంలో ఒక్కో రేషన్ కార్డుకు రూ. 3వేలు వసూలుతో పాటు మొత్తం విరాళాల ద్వారా రూ.కోటి వరకు వచ్చాయని, దాతల ద్వారానే గుడి నిర్మాణ పనులు కాగా విరాళాల ద్వారా వచ్చిన నిధుల్లో ఎన్ని ఖర్చు అయ్యాయో ఎందుకు తెలుపడం లేదని అన్నారు. ఇటీవల ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అసత్య ఆరోపణలు చేస్తూ గ్రామ పరువు తీస్తున్న మనోజ్‌రెడ్డి నిజాయితీ నిరూపించుకునేందుకు ఈనెల 25వ తేదీన గుడి వద్దకు వచ్చి ప్రజల ముందు లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్త సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ శివారు నమిలిగొండలో ఉన్న ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో 6,7వ తరగతులు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సీట్ల ఖాళీల భర్తీ కోసం ఈనెల 12, 13వ తేదీల్లో నిర్వహించనున్న స్పాట్ అడ్మిషన్ కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న ఉదయం 10 గంటల నుంచి 13న సాయంత్రం 4 గంటల వరకు స్పాట్ అడ్మిషన్లు ఉంటాయన్నారు. పూర్తి వివరాల కోసం 9848561693 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

కల్లుగీత కార్మికులను ఆదుకోవాలి

జనగామ రూరల్: ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేసి వారిని ఆదుకోవాలి కేజీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నె వెంకట మల్లయ్య కోరారు. గీతన్నల చైతన్య యాత్ర అమరుల యాదిలో భాగంగా శుక్రవారం మండలంలోని పెంబర్తి గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరుడు అంబాల మల్లయ్య చిత్రపటానికి నాయకులు పూల మాల వేసి నివాళులర్పించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కొడకండ్ల: సైబర్ నేరాలపై ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలకేంద్రంలోని బాలికల రెసిడెన్షియల్ గురుకులంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైబర్ నేరాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

విరాళాల సేకరణ

జనగామ రూరల్: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ జిల్లా వరద బాధితుల కోసం సీపీఎం ఆధ్వర్యాన విరాళాలు సేకరించినట్టు జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా సేకరించిన రూ.51,143 రాష్ట్ర కమిటీ అకౌంట్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు.

హిందువులపై దాడులు ఆపాలి

జనగామ రూరల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని జనగామ పట్టణంలో విశ్వహిందూ పరిషత్, హిందు దేవాలయాల పరిరక్షణ సమితి, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రపంచ దేశాలు స్పందించి బంగ్లాదేశ్‌లో శాంతిని నెలకొల్పాలని కోరారు.

సంతాపం

చిల్పూరు: కృష్ణాజీగూడెం గ్రామ మాజీ సర్పంచ్ జక్కుల వీరయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

పీఏసీఎస్ మాజీ చైర్మన్ మృతి

బచ్చన్నపేట: పోచన్నపేట గ్రామానికి చెందిన మండల పీఏసీఎస్ మాజీ చైర్మన్ దొంతుల రాజు శుక్రవారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను పలువురు పరామర్శించి సంతాపం తెలిపారు.

అభినందనీయం



పాలకుర్తి: విద్యార్థులకు వెన్నెల ఉమారాణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గొడుగులను పంపిణీ చేయడం అభినందనీయమని కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం వావిలాల గ్రామంలోని పాఠశాలలో 150 మంది విద్యార్థులకు వీఆర్ ఫౌండేషన్ కన్వీనర్ మొలుగూరి యాకయ్యగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గొడుగుల పంపిణీలో తిరుపతిరెడ్డి పాల్గొని మాట్లాడారు.

ఘనంగా తీజ్ పండుగ

రఘునాథపల్లి: మండలంలోని వేపలగడ్డతండాలో గురువారం రాత్రి గిరిజనులు ఘనంగా తీజ్ పండుగ జరుపుకున్నారు. అత్యంత భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజులుగా గోదుమ బుట్టలకు నీరుపోసి పెంచి చివరి రోజు నీళ్లలో నిమజ్జనం చేశారు.

వన మహోత్సవం

జఫర్‌గఢ్: మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వన మహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించడంతో పాటు మొక్కలు నాటారు. ఎంపీడీఓ సుమన్, నాయబ్ తహసీల్దార్ హరిప్రసాద్, ఎస్సై రామ్‌చరణ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కొడకండ్ల: ప్రస్తుత సీజన్‌లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ పేరం విజయవర్షిణి సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో నిర్వహించిన వైద్యశిబిరంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు డాక్టర్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బచ్చన్నపేట: ఇంటి చుట్టూ, వీధుల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు అన్నారు. శుక్రవారం పలు గ్రామాల్లో శుక్రవారం డ్రై డేను నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరుప్పుల: మండల కేంద్రంతోపాటు ధర్మాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి నేడు(శనివారం) మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ సుధాకర్ తెలిపారు. దేవరుప్పుల పరిధి ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకూ, ధర్మాపురం పరిధిలో 11 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు వివరించారు.

కళాజాతా

తరిగొప్పుల: ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో శుక్రవారం మండలకేంద్రంలో కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు ఆరు గ్యారెంటీలు, పరిసరాల పరిశుభ్రత, గంజాయిపై ప్రజలకు అవగాహన కల్పించారు.

వర్గీకరణ తీర్పు న్యాయవ్యవస్థపై నమ్మకం పెంచింది

జనగామ రూరల్: ఎస్సీ వర్గీకరణపై మందకృష్ణ మాదిగ కృషితోనే సుప్రీం కోర్టులో తీర్పు వచ్చిందని దీంతో న్యాయవ్యవస్థపై నమ్మకం పెంచిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలో మంద కృష్ణచిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.